సాక్షి అనకాపల్లి

మంగళవారం ౹ 3 ౹ అక్టోబర్ ౹ 2023



కాపాడిన లైఫ్‌గార్డ్స్

విశాఖ: రుషికొండ బీచ్‌లో వెస్ట్ బెంగాల్‌కు చెందిన యువకులు ప్రకాష్, జన కొట్టుకుపో తుండగా లైఫ్ గార్డ్స్ కాపాడారు.



కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది.



విత్తన బంతులతో..

విత్తన బంతులతో విశాఖను హరిత వనం చేద్దామని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. 8లో

న్యూస్‌రీల్

సెలవు రోజున తరగతులు

ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో నాగేంద్ర

నర్సీపట్నం: సెలవు దినమైన గాంధీ జయంతి రోజున ప్రత్యేక తరగతులు నిర్వహించిన ప్రైవేటు పాఠశాలలకు జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేశామని ఎంఈవో జి.వి.ఎస్.నాగేంద్ర తెలిపారు. సెలవు రోజున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాంకు ఫిర్యాదు చేశారని ఎంఈవో తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు శ్రీవిద్యాంజలి ఇంగ్లిష్ మీడియం స్కూల్, శ్రీచైతన్య టెక్నో స్కూల్, అమరావతి ఇంగ్లిష్ మీడియంను తాను స్వయంగా పరిశీలించి, స్కూల్ యాజమాన్యాలపై ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోకూడదో 24 గంటల్లో సమాధానం చెప్పాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలతో నోటీసులు ఇచ్చామన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి సన్నిధిలో వేదప్రకాష్ దంపతులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీమహాలక్ష్మి గోదా దేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామిని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి వేదప్రకాష్ సోమవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా ఆయన అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ప్రసాదాన్ని అందజేశారు.

నేటి నుంచి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పర్యటన

సాక్షి, విశాఖపట్నం : కేంద్ర సమాచార శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం నుంచి 3 రోజుల పాటు విశాఖలో పర్యటించనుంది. కమిటీ చైర్‌పర్సన్ ప్రతాప్‌రావ్ జాదవ్ అధ్యక్షతన 20 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులతో కూడిన బృందం మంగళవారం నగరానికి చేరుకోనుంది. పర్యటనలో భాగంగా బీఎస్ఎన్ఎల్, రైల్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, భారతీ ఎయిర్‌టెల్, భారతీ ఎక్సాకామ్, రిలయన్స్, జియో సంస్థల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ పథకం కింద ఆయా సంస్థలు అమలు చేస్తున్న వ్యూహాల గురించి సమీక్ష నిర్వహించనున్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ(మైటీ), హైదారాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ టెస్ట్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రతినిధులతో సమావేశం కానున్నారు.

ఖైదీల్లో పరివర్తన రావాలి



ఖైదీకి బహుమతి అందజేస్తున్న కలెక్టర్

ఆరిలోవ: జైలు జీవితం అనుభవిస్తున్న ఖైదీల్లో పరివర్తన రావాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆకాంక్షించారు. విశాఖ కేంద్ర కారాగారంలో అధికారులు గాంధీ జయంతి సందర్భంగా ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీలకు నాటికలు, వక్తృత్వం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ, జైల్ సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్లు పి.ఎస్.రామచంద్రరావు, ఎస్.కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

విశాఖ విద్య: భవిత కేంద్రాల్లో రిసోర్స్ పర్సన్‌గా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం నుంచి ఈ నెల 5 వరకు ఉంటుందని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని కేడీపీఎం హైస్కూల్ ప్రాంగణంలో ప్రతీ రోజూ ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమవుతుందని, మంగళవారం వీహెచ్/హెచ్ఐ అభ్యర్థులు, 4న ఎంఆర్ అభ్యర్థులు హాజరుకావాలన్నారు.



తారువ క్యాంప్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



గాంధీజీ, శాస్త్రీజీలకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



అనకాపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులు

గాంధీజీ ఆశయాల సాధన దిశగా..

దేవరాపల్లి/ తుమ్మపాల/అనకాపల్లి టౌన్: జాతిపిత మహాత్మగాంధీ, దివంగత ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా జిల్లా ప్రజలు వారికి ఘనంగా నివాళులర్పించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దేవరాపల్లి మండలం తారువలోని తన క్యాంప్ కార్యాలయంలో మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇది సాధ్యమైందన్నారు. అవినీతికి తావు లేకుండా రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఓఎస్‌డీ ఎం.పోలినాయుడు, స్థానిక పంచాయతీ కార్యదర్శి పి.అప్పలనాయుడు పాల్గొన్నారు. అనకాపల్లి కలెక్టరేట్‌లో సోమవారం గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రిల చిత్రపటాలకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీ స్ఫూర్తితో గ్రామ స్వరాజ్యం, స్వచ్ఛభారత్ సాకారానికి పాటుపడాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్ రాజ్, డీఆర్వో బి.దయానిధి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అనకాపల్లి రింగ్‌రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గాంధీజీకి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామస్వరాజ్యం తీసుకొచ్చారన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ బొడ్డేడ లక్ష్మీనర్సింహరావు, ఎన్టీఆర్ వైద్యాలయ డైరెక్టర్ ఎ.వి.రత్నకుమారి, ఆలయ కమిటీ చైర్మన్లు కె.ఎం.నాయుడు, సుదిరిపాటి తాతాజీ పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలకు బంగారు 'భవిత'

- సహిత విద్యతో ఉత్తమ ఫలితాలు
- తీర్చిదిద్దుతున్న భవిత కేంద్రాలు
- ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు
- జిల్లాలో 711మంది విద్యార్థులకు మేలు
- ప్రత్యేక అవసరాలు గల బాలల్లో చక్కని మార్పు



భవిత కేంద్రాల్లో విద్యను అందిస్తున్న సహిత విద్య ఉపాధ్యాయులు



ఇంటి వద్దనే దివ్యాంగ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న సహిత విద్య ఉపాధ్యాయుడు

కె.కోటపాడు: దివ్యాంగులైన విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించి వారిలో మార్పును తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థుల్లో మంచి మార్పు కనిపించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులైన విద్యార్థులకు ఆరోగ్యం మెరుగుపరచడంతోపాటు చదువుపై ఏకాగ్రత పెరిగేలా సహిత విద్యను బోధిస్తున్నారు. ఇందుకోసం 21 రకాల వైకల్యాలను గుర్తించారు. వాటితో బాధ పడుతున్న విద్యార్థులకు 18 ఏళ్ల వరకు ఈ కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నారు. మూగ, వినికిడి లోపం, దృష్టి దోషం, చలనలోపం, మానసిక వైకల్యంతో బాధ పడుతున్న విద్యార్థులు ఈ కేంద్రాలకు వస్తున్నారు.



దివ్యాంగ విద్యార్థులకు కంప్యూటర్‌లో దృశ్య విద్యా బోధన

జిల్లాలో 24 మండలాల్లో..

జిల్లాలో గల 24 మండల కేంద్రాల్లో భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల్లో 471 మంది చదువు, శిక్షణ పొందుతున్నారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు ప్రతి కేంద్రంలో ఇద్దరు సహిత విద్య ఉపాధ్యాయులు ఉంటారు. అక్కడకు రాలేని మరో 240 మంది విద్యార్థులకు ప్రతి శనివారం సహిత విద్య ఉపాధ్యాయులు వారి ఇళ్లకు వెళ్లి బోధన, శిక్షణ అందిస్తున్నారు. కేంద్రాలకు రాలేని పరిస్థితిలో ఉన్న విద్యార్థులకు హోమ్ బేస్డ్ విద్యా విధానంలో బోధిస్తారు. వారి తల్లిదండ్రులకు విద్యార్థి మానసిక పరిస్థితిని వివరించడంతోపాటు వారి సంరక్షణ పట్ల జాగ్రత్తలను తెలుపుతారు. భవిత కేంద్రాల్లో కంటి సంబంధిత సమస్యలు గల విద్యార్థులకు సహిత విద్య ఉపాధ్యాయులు చలనంతో కూడిన విద్య, బ్రెయిలీ లిపిలో బోధనను అందిస్తున్నారు. లోవిజన్ ఉన్న విద్యార్థులను బ్రైట్ లైటింగ్‌లో ఉంచి వారిలో మార్పును తీసుకువచ్చేందుకు శిక్షణ ఇస్తున్నారు. మూగ విద్యార్థులకు స్పీచ్ థెరపీ, సంజ్ఞలతో కూడిన విద్య, బుద్ధి మాంద్యం గల వారికి మానసిక ప్రవర్తనలో మార్పు వచ్చేలా శిక్షణ అందించి వారిలో ఏకాగ్రత పెంపొందేలా కృషి చేస్తారు. బుద్ధి మాంద్యం గల విద్యార్థులు సహాయకులు లేకుండా వారి పని వారే చేసుకునే విధంగా శిక్షణ ఇస్తున్నారు. వీటితోపాటు విద్యార్థులకు కంప్యూటర్ తరగతులను కూడా నిర్వహిస్తున్నారు. కంప్యూటర్‌లో దృశ్య రూపంతో కూడిన పాఠాలు, కథలు, బొమ్మల రూపంలో చూపించడం వలన విద్యార్థుల్లో మానసికోల్లాసాన్ని పెంచుతున్నారు.

విద్యార్థులకు ఫిజియో థెరపీ

శారీరక మార్పుల్లో ఇబ్బందులు గల విద్యార్థులకు వారానికి ఒక రోజు భవిత కేంద్రాల్లో వైద్యాధికారి పర్యవేక్షణలో ఫిజియోథెరపీ చేస్తున్నారు. భవిత కేంద్రాలకు రాలేని పరిస్థితిలో గల విద్యార్థుల ఇళ్లకు వెళ్లి సహిత విద్య ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణను అందిస్తూ వారి పరిస్థితిలో మార్పు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.



భవిత కేంద్రంలో ఫిజియోథెరపీని నిర్వహిస్తున్న దృశ్యం

శిక్షణతో విద్యార్థుల్లో మార్పు



దివ్యాంగ విద్యార్థుల్లో మార్పును తీసుకు వచ్చేందుకు ప్రత్యేకంగా భవిత కేంద్రాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణతోపాటు ఫిజియోథెరపీని అమలు చేస్తున్నాం. వారిలో మంచి మార్పు కనిపిస్తోంది.

–శకుంతల, జిల్లా సహిత విద్య సమన్వయకర్త

నా కుమారుడిలో మెరుగుదల వచ్చింది



గతంలో నా కుమారుడు ప్రసాద్ ఏమి చేస్తుండేవాడో తెలియని పరిస్థితి ఉండేది. భవిత కేంద్రంలో ఉపాధ్యాయులు ఇస్తున్న శిక్షణతో పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. ప్రస్తుతం ఆకలి వేసినా, దాహం వేసినా తన ప్రవర్తనతో నాకు అర్థమయ్యేలా తెలియజేస్తున్నాడు.

–ఎస్.అన్నపూర్ణ, విద్యార్థి తల్లి, కె.కోటపాడు

వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలి



వేసిన చిత్రాలతో విద్యార్థులు

ఆరిలోవ: వన్యప్రాణుల సంరక్షణకు అందరూ సహకరించాలని సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి సూచించారు. సోమవారం జూ పార్కులో వన్యప్రాణి వారోత్సవాలను జూ క్యూరేటర్ నందనీ సలారియాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కలిగించడానికి ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8 వరకు జరగనున్న ఈ వారోత్సవాల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో సీపీఈ జూనియర్ కళాశాల ప్రతినిధులు, సిబ్బంది ఇక్కడ జంతువుల సంరక్షణ కోసం రూ.40 వేల చెక్కును సీసీఎఫ్‌కు అందజేశారు. ఆయా చిన్నారులు వేసిన చిత్రాలను ప్రదర్శించారు.

జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ అవగాహన సదస్సు నేడు

అనకాపల్లి టౌన్: జాతీయ లైవ్‌స్టాక్‌మిషన్ జిల్లా స్థాయి అవగాహన సదస్సును స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాలులో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగం పారిశ్రామికీకరణ, దాని వల్ల లభించే ఉపాధి అవకాశాల గురించి ఈ సమావేశంలో వివరిస్తారన్నారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామచంద్రరావు హాజరవుతారని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు పటిష్ట నిఘా

దొండపర్తి: రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం సుశిక్షితులైన సాయుధ దళాలతో నిరంతరం పటిష్టమైన నిఘాతో సేవలందిస్తోందని రాజమండ్రి జోన్ కమాండెంట్ డాక్టర్ కె.ఎస్.రావు తెలిపారు. సోమవారం విశాఖలో పర్యటించిన ఆయన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి తమ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న నాల్కోను సందర్శించారు. గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ చోరీలు, విధ్వంసాలు జరగకుండా 136 మంది సాయుధ దళం సిబ్బంది అనుక్షణం ప్రభుత్వ ఆస్తులకు గస్తీ కాస్తున్నట్లు వెల్లడించారు. రాజమండ్రి జోన్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఎస్పీఎఫ్ భద్రతలో ఉన్న అన్ని ప్రాంతాలను పరిశీలించి, సూచనలు చేస్తున్నట్లు తెలిపారు.



సింహాచలంలో ఎస్‌పీఎఫ్ రాజమండ్రి జోన్ కమాండెంట్ డాక్టర్ కె.ఎస్.రావు

టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక

అనకాపల్లి టౌన్: స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో సోమవారం టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ కాండ్రేగుల విష్ణుమూర్తి మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడాపోటీలు అనంతపురం జిల్లాలో జరుగుతాయని, ఇందులో పాల్గొనే జిల్లా స్థాయి క్రీడాకారులను ఎంపిక చేశామని చెప్పారు. అండర్ 17 బాలుర, బాలికల జట్లను ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.రామకృష్ణ, కార్యదర్శి యల్లపు శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

బండారు.. ఖబడ్దార్



నిరసన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, మహిళలు

- ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- మంత్రి రోజాపై అసభ్యకర వ్యాఖ్యలకు నిరసన

సింహాచలం: రాష్ట్ర మంత్రి ఆర్.కె. రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి డిమాండ్ చేశారు. పెందుర్తి నియోజకవర్గ మహిళా నేతలు సోమవారం పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ బండారు ఇంట్లో కూడా మహిళలు ఉన్నారని గుర్తించుకోవాలన్నారు. బండారు నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రాజకీయ విమర్శలు ఎన్నైనా చేసుకోవచ్చని, మహిళలపై నీచమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మహిళలంటే గౌరవం లేకుండా బండారు ప్రవర్తిస్తున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టిలో పడేందుకు ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేశారన్నారు. టీడీపీకి, చంద్రబాబుకు కూడా మహిళలంటే గౌరవం లేదన్నారు. ఆడపిల్ల పుట్టుకనే చులకన చేసిన వ్యక్తి చంద్రబాబు అని, అలాంటి చంద్రబాబు వద్ద బండారు పనిచేస్తున్నారన్నారు. జెర్రిపోతులపాలెంలో మహిళపై జరిగిన దాడి విషయంలో ఆరోజే బండారుని ఇంట్లో ఆడవాళ్లు కొట్టి ఉంటే ఈరోజు ఇలాంటి వ్యాఖ్యలు చేసి ఉండేవారు కాదని తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ బండారు సత్యనారాయణ పెందుర్తి నియోజకవర్గ పరువు తీశారన్నారు. ప్రపంచంలో ఉన్న తెలుగువాళ్లంతా ఈరోజు బండారును అసహ్యించుకుంటు న్నారన్నారు. ఇరవై ఏళ్లు శాసనసభ్యుడుగా పనిచేశానని చెప్పుకునే బండారు సంస్కారం ఇదేనా అని ప్రశ్నించారు. కాల్‌మనీ, సెక్స్ రాకెట్, మహిళా తహసీల్దార్ జుట్టుపట్టుకుని ఈడ్చుకొచ్చిన సంఘటనలు టీడీపీ పాలనలో చూశామన్నారు. మహిళలకు ఉన్నతస్థితి కల్పించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారన్నారు. దళిత మహిళను హోంమంత్రిగా చేశారన్నారు. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడితే పెందుర్తి నియోజకర్గ ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, పెందుర్తి ఎంపీపీ నాగమణి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నదియా, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నక్క నూకరాజు, నాయకులు దేవిసాంబ, శరగడం నరసింహమూర్తి, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మహిళలు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'లో వైద్య నిపుణుల సేవలు

- రెండో పీహెచ్‌సీలో తప్పనిసరిగా మహిళా డాక్టర్ నియామకం
- ఆయుర్వేద వైద్యాన్ని విస్తరించడానికి ప్రత్యేక చర్యలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రజిని

ఆనందపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడానికి సుమారు ఐదు వేల మంది వైద్య నిపుణులను వినియోగిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. సోమవారం మండలంలోని శొంఠ్యాంలో రూ.6.67 కోట్లతో ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీ నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలను ఇంటి వద్దే అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ముందుగా రోగులను గుర్తించడం ప్రత్యేక వైద్య శిబిరాలు ద్వారా వారికి చికిత్సలు అందించడం వంటి మహత్తర కార్యక్రమం దేశంలో ఎక్కడా లేదన్నారు. వైద్య సిబ్బంది రోగులను జల్లెడ పట్టి సేవలు అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యంతో పాటు విద్యార్థులకు వైద్య విద్యను అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకే సారి 15 వైద్య కళాశాలలను మంజూరు చేయగా అందులో ఇప్పటికే 5 కళాశాలలను ప్రారంభించామని చెప్పారు.

ఆయుర్వేద వైద్యం విస్తరణకు ప్రత్యేక చర్యలు

రాష్ట్రంలో యునానీ వైద్యంతో పాటు ఆయుర్వేద వైద్యాన్ని విస్తరించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. శొంఠ్యాంలో ఏర్పాటు చేస్తున్న ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీ కేంద్రంలో తయారైన మందులను ఇక్కడే తనిఖీ చేసి రాష్ట్రంలో గల అన్ని ఆయుర్వేద వైద్యంలో అందజేయడం జరుగుతుందన్నారు. ఇక్కడ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల సుమారు 150 మందికి ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 70 వైద్య శిబిరాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. శొంఠ్యాంలో రెండో పీహెచ్‌సీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే కొంతమంది కోర్టు ద్వారా ఆటంకాలు కల్పించడం మంచిదికాదన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మల్లికార్జున, ఆయుష్ విభాగం ఆర్‌డీడీ వై.శేఖర్, మూడు జిల్లాల పార్టీ యూత్ విభాగం కో–ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీష్, ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు పాల్గొన్నారు.

విత్తన బంతి.. హరిత కాంతి

హెలికాప్టర్ల ద్వారా విత్తన బంతులు చల్లిన జీవీఎంసీ



నేవీ సిబ్బందికి విత్తన బంతులు అందజేస్తున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, నేవల్ అధికారి మనీష్‌శర్మ



జెండా ఊపి హెలికాప్టర్లు ప్రారంభిస్తున్న మేయర్, నేవల్ అధికారులు

డాబాగార్డెన్స్: అడవులు సహజ సిద్ధంగా తయారు కావాలి. గుంతలు తవ్వి, మొక్కలు నాటి అడవులు సృష్టించడం అసాధ్యం. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన అడవి జీవవైవిధ్యానికి అద్దం పడుతుంది. ఇలాంటి అడవులను సృష్టించేందుకు జీవీఎంసీ కృషి చేస్తోంది. ఒకవైపు మొక్కలు నాటుతూనే మరోవైపు నగరంలో ఏడు కొండలపై సీడ్ బాల్స్ విసిరి మొక్కలు పెంచే కార్యక్రమానికి ఈస్ట్రన్ నేవల్ కమాండ్, గ్రీన్ క్లైమేట్ సంస్థ సహకారంతో జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని సోమవారం ఐఎన్ఎస్ డేగా వద్ద నేవల్ అధికారి మనీష్‌శర్మతో కలిసి మేయర్ హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. 4 హెలికాప్టర్ల ద్వారా సుమారు 6 లక్షల విత్తనాలను సేకరించి నగరంలోని పావురాల కొండ 1, 2, కాపులుప్పాడ, సింహాచలం, పార్లుపాలెం కొండ, వేదుళ్లనరవ కొండ, యారాడ కొండలపై విడుదల చేసినట్లు మేయర్ తెలిపారు. విత్తన బంతులతో విశాఖను హరిత వనం చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, హార్టికల్చర్ డీడీ దామోదర్, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ పలువురు జీవీఎంసీ అధికారులు, నేవల్ అధికారులు, గ్రీన్ క్లైమేట్ సంస్థ ప్రతినిధి జేవీ రత్నం పాల్గొన్నారు.



హెలికాప్టర్ల వద్దకు విత్తన బంతులు తీసుకెళ్తున్న సిబ్బంది



కొండలపై విత్తన బంతులు జల్లుతున్న హెలికాప్టర్ సిబ్బంది

కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత



కేజీహెచ్‌లో జోగిసూరికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వరలక్ష్మి

మునగపాక: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ మంచి ఫలితాలు ఇస్తోంది. వలంటీరుకు కేటాయించిన 50 కుటుంబాల వారికి మెరుగైన సేవలందిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. మూలపేటకు చెందిన ఆదారి జోగిసూరి అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో సంబంధిత వలంటీర్ కనిశెట్టి వరలక్ష్మి అక్కడకు వెళ్లి పింఛన్ సొమ్ము రూ.2750 అందజేశారు. వలంటీర్ సేవలను స్థానికులు అభినందిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): గత నెల 30 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు కర్నూల్ జిల్లా మహానందిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అనకావల్లి జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల్ని రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ఎస్. విజయ్ శంకర్‌రెడ్డి అభినందించారు. ప్రథమ స్థానం సాధించిన జిల్లా జట్ల క్రీడాకారుల్ని రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరావు, కోశాధికారి ఆదినారాయణ, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభుజీ, ప్రధాన కార్యదర్శి గొంప నర్సింహనాయుడు అభినందించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొట్టి మహిళకు గాయాలు

రావికమతం: పాడేరు నుంచి కాకినాడ వెళ్తున్న పాడేరు డిపో ఆర్టీసీ బస్సు మండలంలోని చిలకవానిపాలెం వద్ద రోడ్డు దాటుతున్న గంధం చినతల్లి(54)ను సోమవారం సాయంత్రం ఢీకొట్టింది. దీంతో ఆమె తీవ్ర గాయాల పాలైంది. తక్షణమే స్థానికులు ఆమెను నర్సీపట్నం ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో పశువులు కాస్తున్న చినతల్లి ఇక్కడ రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురైంది. ప్రాణాపాయం ఏమీ లేదని చికిత్స చేస్తున్నారని వైస్ ఎంపీపీ మత్స్య భవానీప్రసాద్ తెలిపారు.

బావిలో పడి రైతు మృతి



రైతు శంకరరావు(57)

కొంకోట: మండలంలోని బయ్యవరంలో బావిలో సోమవారం ప్రమాదవశాత్తు తూలి పడి రైతు మృతి చెందాడు. అదనపు ఎస్ఐ జక్కుల నాగేశ్వరరావు వివరాల ప్రకారం... బయ్యవరానికి చెందిన బలిజ శంకరరావు(57) వ్యవసాయం జీవనాధారంగా కుటుంబ పోషిస్తున్నాడు. తన పొలం ప్రాంతంలోనే ఇల్లు కట్టుకుని నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఇంటో వాడుక అవసరాల కోసం బావి నుంచి నీరు తోడుతూ తూలి లోపల పడి మునిగిపోయాడు. దీంతో పోలీసులకు సమాచారం అందడంతో అనకాపల్లి నుంచి అగ్నిమాపక శకటం రప్పించి బావిలో నీరు కొంత మేర తోడించి శంకరరావు మృతదేహాన్ని సాయంత్రం వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కుమారుడు వినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



శంకరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న అదనపు ఎస్ఐ జక్కుల నాగేశ్వరరావు

సరుగుడు లారీ బోల్తా

తప్పిన ప్రమాదం



బోల్తా పడిన సరుగుడు లారీ

రావికమతం: మండలంలోని జెడ్.కొత్తపట్నం వద్ద సోమవారం సరుగుడు లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ఎటువంటి గాయాలు కాలేదు. కొత్తకోట సమీప పొలాల్లోంచి సరుగుడు లోడుతో కల్యాణపులోవ రిజర్వాయర్ కాలువ గట్టుపై నుంచి వెళ్తుండగా ఒక్కసారిగా ఒరిగి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ చిన్నారావు చాకచాక్యంగా దూకేయడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు.

చోడవరంలో అశ్లీల నృత్యాలు

ఐదుగురిపై కేసు

చోడవరం రూరల్: గణేష్ నిమజ్జనంలో భాగంగా పట్టణంలోని గునిశెట్టివారి వీధిలో సోమవారం రాత్రి హిజ్రాలతో అశ్లీల నృత్యాలు చేయిస్తుండగా ఎస్ఐ సూర్యనారాయణ తన సిబ్బందితో దాడి చేశారు. బాధ్యులైన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున గునిశెట్టివారి వీధికి చెందిన గోలి గోవింద్, బత్తుల పైడిరాజు, నక్కా నాగదుర్గారెడ్డి, ఇంటి పవన్, శీలం శివకేశవలపై కేసు నమోదు చేశామన్నారు.

నేడు, రేపు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రజిని పర్యటన



సాక్షి,పాడేరు: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఈనెల 3,4 తేదీల్లో అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో పర్యటించనున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలుజేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ఆమె ప్రారంభిస్తారు. మంత్రి పర్యటన ఏర్పాట్లలో పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖల అధికారులు నిమగ్నమయ్యారు. 3వతేదీ మధ్యాహ్నం విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గంలో మంత్రి బయలుదేరి అనంతగిరిలోని టూరిజంశాఖకు చెందిన హరితవేలి రిసార్ట్‌కు మధ్యాహ్నం 3.30 గంటలకు చేరుకుంటారు. సాయంత్రం 5.30 వరకు అక్కడే మంత్రి ఉంటారు. అనంతరం అక్కడ నుంచి అరకులోయకు బయలుదేరుతారు. సాయంత్రం 6.30గంటలకు అరకులోయ రైల్వే గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. మరుసటి రోజు బుధవారం ఉదయం డుంబ్రిగుడ మండలంలో పర్యటిస్తారు. జైపూర్ రోడ్డు జంక్షన్‌లోని కిల్లోగూడ గిరిజన సంక్షేమ బాలికల ఇంగ్లిషు మీడియం ఆశ్రమ పాఠశాలను ఉదయం 10.30 గంటలకు సందర్శిస్తారు. ఈ పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి, వైద్య సేవలను పర్యవేక్షిస్తారు. అనంతరం 11.30గంటలకు అరకులోయ మండలం యండపల్లివలసలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలకు చేరుకుంటారు. ఇక్కడ ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష ఆరోగ్యశిబిరాన్ని మంత్రి ప్రారంభించి, పర్యవేక్షిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12.30గంటలకు రోడ్డు మార్గంలో మంత్రి విశాఖపట్నానికి తిరిగి ప్రయాణమవుతారు.

గాంధీజీ శాంతిమార్గంలో యువత నడవాలి

ఘన నివాళులర్పించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: గాంధీజీ జయంతి సందర్భంగా చోడవరం పట్టణంలో హార్డింజ్ రెస్ట్ హౌస్, కొత్తూరు జంక్షన్, వెంపలి ఆనందీశ్వరరావు ఇంటి దగ్గర మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ ఎంచుకున్న శాంతి మార్గంలో నేటి యువత నడవాలన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెంపలి ఆనందీశ్వరరావు, హారిక రామకృష్ణ, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకటరావు, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పాల్గొన్నారు. గాంధీ గ్రామంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి సర్పంచ్ గాడి అప్పారావు నివాళులర్పించారు.



గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న విజయభాస్కర్

గాంధీజీ మహోన్నతుడు

అనకాపల్లి టౌన్: స్థానిక ఎస్పీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్ సోమవారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గాంధీజీ ఆదర్శాలు, విలువలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని కోరారు. బాపూజీ తాను నమ్మిన సిద్ధాంతాల కోసం పట్టుదలగా నిలబడి, ఆచరించి, దేశ స్వాతంత్ర్యం సాధించుటలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ప్రపంచ చరిత్రలోనే తనదైన ముద్రవేసి మహోన్నత వ్యక్తిగా అవతరించారని తెలిపారు. బాపూజీ చూపిన అహింసా, సత్యం సిద్ధాంతాలు నేటి పాలకులు, ప్రజలకు ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, టి.శ్రీను, ఎస్ఐలు వెంకన్న, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

8న మర్రివలసలో అభివృద్ధి పనులు ప్రారంభం

హాజరు కానున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: మండలంలోని మర్రివలస గ్రామంలో ఈ నెల 8న పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. సోమవారం ఇక్కడ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ పనులపై సర్పంచ్ పొంతపల్లి అప్పలనర్సమ్మ, పార్టీ యువజన విభాగం నాయకుడు ద్వారపూడి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కోటాన సూరిదేముడులతో కలిసి చర్చించారు. ఈ ప్రారంభోత్సవాలకు పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హాజరు కానున్నారని ఎంపీపీ తెలిపారు. గతంలో అభివృద్ధి లేని మర్రివలసలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, ఆర్బీకే నిర్మాణానికి రూ.21 లక్షలు, హెల్త్ వెల్‌నెస్ భవనానికి రూ.20.80 లక్షలు, ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు జలజీవన్ మిషన్ నుంచి రూ.40 లక్షలు, సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు రూ.30 లక్షలు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు మంజూరు చేశారన్నారు. పాల సంఘం అధ్యక్షుడు కన్నూరు మహలక్ష్మినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బండారు ముత్యాలనాయుడు, గొర్రుపోటు వెంకటరావు, భూమిరెడ్డి దేముళ్లు, చీపురపల్లి అచ్చిబాబు, వర్రి రామునాయుడు, ఏటుకూరి రాజేష్, జామి బుచ్చిరాజు, తర్రా మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతపై స్పెషల్ ప్రోగ్రామ్

- ఈపీడీసీఎల్ పరిధిలో ప్రతి నెలా 2వ తేదీన నిర్వహించేందుకు ప్రణాళిక
- ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రచార రథం
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



ప్లకార్డులతో ప్రచారం చేసే సిబ్బందితో ఈపీడీసీఎల్ సీఎండీ, డైరెక్టర్లు, ఎస్ఈలు

సాక్షి, విశాఖపట్నం: నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు ప్రమాదాలను అరికట్టేందుకు విద్యుత్ భద్రత అంశాలపై అవగాహన కార్యక్రమాలను గాంధీ జయంతి పురస్కరించుకొని ఇకపై ప్రతినెలా 2వ తేదీన క్రమం తప్పకుండా నిర్వహిస్తామని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ప్రకటించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన విద్యుత్ భద్రత అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎండీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ భద్రత అవగాహన రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. సంస్థ సిబ్బందితో క్షేత్రస్థాయి నుంచి అధికారుల వరకు ప్రతీ ఒక్కరూ భద్రతాసూచనలను తప్పకుండా ఆచరిస్తామని విశాఖ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించామని ఇందులో భాగంగా సంస్థ పరిధిలోని ఉన్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలోని 11 జిల్లాల వినియోగదారులకు, సిబ్బందికి విడివిడిగా భద్రతా సూచనలు తయారుచేశామన్నారు. ప్రచార రథంతో అవగాహన కల్పించడంతో పాటు భవన నిర్మాణ కార్మికులు, తోటల యజమానులు, రైతు కూలీలు, వాహనాల డ్రైవర్లకు ప్రత్యేకంగా సూచనలను రూపొందించినట్లు వివరించారు. విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబరు 1912 కు ఫోన్ చేయాలని సూచించారు. ఆపరేషన్స్ డైరెక్టర్ బి.రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ భద్రత సూచనలకు సంబంధించిన ఆడియోలను తయారుచేసి సంస్థ పరిధిలోని అన్ని సెక్షన్ కార్యాలయాలకు పంపించినట్లు వివరించారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, ఏపీపీ సూర్యప్రతాప్, సీజీఎంలు, ఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పినతల్లి ఘాతుకం

- పీక నులిమి మూడేళ్ల చిన్నారి హత్య
- సరియాపల్లి గ్రామంలో ఘటన



వంతాల హర్షిణి గొంతుపై ఉన్న రాయి

ముంచంగిపుట్టు: మండలంలోని బంగారు మెట్ట పంచాయతీ సరియాపల్లిలో దారుణం చోటు చేసుకుంది. ముద్దులొలికే మూడేళ్ల పాపను పిన తల్లి కనికరం లేకుండా పీక నులిమి, గొంతుపై బండ రాయి పెట్టి కాలితో నొక్కి కర్కశంగా హత్య చేసింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సరియాపల్లి గ్రామానికి చెందిన వంతాల భాస్కరరావు 2011లో అరడకోట పంచాయతీ నిమ్మగుంట గ్రామానికి చెందిన పాంగి శాంతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. మొదటి సంతానం బాబు కాగా, రెండో కాన్పులో పాప హర్షిణి పుట్టింది. హర్షిణి పుట్టిన మూడు నెలలకే శాంతి అనారోగ్యంతో చనిపోవడంతో అప్పటి నుంచి నాన్నమ్మే వారి ఆలనాపాలనా చూసింది. 2021 సంవత్సరంలో చింతపల్లి మండలం కుడుముసారా పంచాయతీ కాకరపల్లి గ్రామానికి చెందిన గెమ్మెలి నీలమ్మను భాస్కరరావు రెండో పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి చేసుకున్న కొద్ది రోజులు బాగానే ఉంది. ఆమెకు పాప పుట్టిన తరువాత మొదటి భార్యకు పుట్టిన పిల్లలను ఇబ్బంది పెట్టడం మొదలు పెట్టింది. మొదటి భార్యకు పుట్టిన బాబును భాస్కరరావు నిమ్మగుంటలో బంధువుల ఇంట్లో ఉంచి చదివిస్తున్నాడు. ఈ నెల 1 తేదీన భాస్కరరావు వేరే గ్రామానికి వెళ్లడంతో నీలమ్మ గ్రామ సమీపంలో కొండపైకి నిర్మానుష్య ప్రదేశానికి పాప హర్షిణి తీసుకువెళ్లి కిందపడేసి గొంతునొక్కడంతో స్పృహ కోల్పోయింది. ఇంకా పాప ప్రాణాలతోనే ఉండడంతో బండరాయిని గొంతుపై వేసి కాలితో బలంగా తొక్కడంతో చనిపోయింది. మరణించిందని నిర్ధారించుకున్న తరువాత ఇంటికి తిరిగి వచ్చింది. పాప తండ్రి భాస్కరరావు ఇంటికి వచ్చేసరికి కుమార్తె లేకపోవడంతో భార్యను అడిగాడు. ఆమె సరిగా సమాధానం చెప్పకపోవడంతో గట్టిగా నిలదీశాడు. పాపను తీసుకుని ఆదివారం మధ్యాహ్నం కొండ మీదకు వెళ్లిందని చుట్టుపక్కల వారు చెప్పడంతో ఆ ప్రాంతానికి వెళ్లి గాలించగా పాప అచేతనంగా పడి ఉండడాన్ని చూసి తండ్రి, బంధువులు రోదించారు. తానే చంపానని నీలమ్మ అంగీకరించింది. దీంతో భాస్కరరావు ముంచంగిపుట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హర్షిణి మృతదేహాన్ని ముంచంగిపుట్టుకు తరలించి వైద్యులు పరిశీలించారు. ఎస్ఐ రవీంద్ర కేసు నమోదు చేశారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

విశాఖ-గుణుపూర్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ నౌపడ-పర్లాకిమిడి స్టేషన్ల మధ్య పవర్ బ్లాక్ తీసుకుంటున్నందుకు ఆయా తేదీల్లో విశాఖ -గుణుపూర్-విశాఖ పాసింజర్ స్పెషల్‌ను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు

- ఈ నెల 4,8,11,15,18,22,25 తేదీల్లో విశాఖ-గుణుపూర్- విశాఖ (08522/08521) పాసింజర్ స్పెషల్ ఇరుమార్గాల్లో రద్దు చేశారు.

గమ్యం కుదింపు..

ఈ నెల 17,21,24,28,31 తేదీల్లో రూర్కెలా-గుణుపూర్(18117)రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ పలాస వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో గుణుపూర్-రూర్కెలా(18118) రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌గా ఈ నెల 18,22,25,29, నవంబరు 1వ తేదీలలో పలాస నుంచి బయల్దేరి రూర్కెలా చేరుకుంటుంది. ఈ తేదీల్లో పలాస-గుణుపూర్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



సర్పంచ్ పైల శిరీషకు చెక్కు అందజేస్తున్న జోగినాయుడు

నాతవరం: దేశంలో ఎక్కడా లేని విధంగా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ఏపీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక క్రియేటివ్ హెడ్ ఎల్.జోగినాయుడు అన్నారు. సర్పంచ్ పైల శిరీష అధ్యక్షతన చెర్లోపాలెం గ్రామసభలో సోమవారం ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు తన సాయం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఊర చెరువును పార్కుగా అభివృద్ధి చేసేందుకు రూ.50 వేల సొంత నిధులు విరాళంగా ఇచ్చారు. చెరువు అభివృద్ధికి తాను కూడా రూ.50 వేల విరాళం ఇస్తానని సర్పంచ్ ప్రకటించారు. గ్రామానికి చెందిన రమేష్ రూ.25 వేల విరాళం ఇచ్చారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు, కార్యదర్శి శేషు, విశ్రాంతి ఉద్యోగి ఎల్.రామునాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాంధీ విగ్రహానికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి


జీవీఎంసీ గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

అనకాపల్లిటౌన్: వివిధ ప్రభుత్వశాఖల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాలని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు బి.అచ్యుతకృష్ణ, చదరం రామచంద్ర, నూకేష్‌లు మాట్లాడుతూ తమను రెగ్యులరైజ్ చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి, కశింకోట, మునగపాక కేంద్రాల సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో పండ్లు, రొట్టెల వితరణ


బీసీ విద్యార్థుల హాస్టల్ ఆవరణలో మొక్కను నాటుతున్న కాండ్రేగుల చందు

అనకాపల్లిటౌన్: జన్మదినాన్ని పురస్కరించుకుని యువత, వృద్ధులు నగదును వృధాచేయకుండా నిరుపేదలకు సహాయం చేయడం, పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటి, వాటి పర్యవేక్షణ చూడాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు అన్నారు. సోమవారం తన జన్మదినాన్ని పురస్కరించుకుని గాంధీనగరంలోని బీసీ విద్యార్థుల వసతి గృహాల్లో మొక్కలు నాటారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. రాష్ట్ర బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంకిత భావం అవసరం


కళాశాల పరిసరాల శుభ్రతలో విద్యార్థులు

సబ్బవరం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు సమాజ సేవపై అంకిత భావం కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి అన్నారు. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ప్రాంగణంలో శ్రమదానం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గాంధీ కలలను సాకారం చేసేందుకు విద్యార్థులంతా కృషి చేయాలని సూచించారు.

అనకాపల్లి సినిమాలు

పెదకాపు	: రాజా
స్కంద	: సత్యనారాయణస్క్రీన్-1
సప్త సాగరాలు దాటి	: సత్యనారాయణస్క్రీన్-2
జవాన్ (మార్నింగ్, మ్యాట్నీ)	
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి (ఫస్ట్ షో, సెకండ్ షో)	: షిర్డిసాయి
స్కంద	: పర్తిసాయి
ఖుషి	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
చంద్రముఖి 2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-23 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 299 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 201 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

బాపూ మార్గం అనుసరణీయం

జాతిపిత మహాత్మా గాంధీ 154వ జయంతిని సోమవారం నియోజకవర్గం అంతటా ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు గాంధీజీ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్ముడు చూపిన బాటలో నడిచి, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అనకాపల్లిటౌన్: భారతదేశంలో స్వాతంత్ర్యం కోసం ప్రజలలో స్ఫూర్తినింపిన వ్యక్తి జాతిపిత మహాత్మాగాంధీ అని నూకాంబిక ఆలయ ఈవో బండారు ప్రసాద్ కొనియాడారు. ఆలయ ఆవరణలో సోమవారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ ఆవరణలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చైర్మన్ కొణతాల మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గాంధేయ మార్గాన్ని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మకర్తలు పీలా లక్ష్మీశ్రీనివాసరావు, కంటపల్లి శోభారాణి, బుద్ధ నర్సింగరాజు, యల్లపు ఈశ్వరరావు, యనమండ్ర శ్రీనివాసు, సిబ్బంది పాల్గొన్నారు.

- స్థానిక ఉడ్‌పేట మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీ 154వ జయంతి వేడుకలు జరిగాయి. సంఘ వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు జాతిపిత సేవాస్ఫూర్తిని వివరించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, పార్టీ శ్రేణులు కొట్నాల పద్మ, సుకురు చంద్రశేఖర్, కాండ్రేగుల శ్రీనివాసరావు, కర్రి భాస్కరరావు, పెనుమత్స కృష్ణంరాజు, వై.జగదీశ్వరరావు, కొణతాల మోదినాయుడు, కోన ఉమ, చింతా రాంజీ, డొంక సత్తిబాబు, పేరూరి కల్యాణ్, బాషా, మోహన్, సాయి పాల్గొన్నారు.
- స్థానిక గాంధీ చౌక్ వద్ద బాపూజీ సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘ వ్యవస్థాపకుడు కరణం శ్రీనివాసరావు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- స్థానిక ఎంహెచ్ స్కూల్ ఆవరణలో స్కూల్ 34వ వార్షికోత్సవంతోపాటు గాంధీ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి 1969, 70, 71 టెన్త్ బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. తొలుత ఆవరణలో ఉన్న సర్వతీదేవి విగ్రహానికి పూజలు చేశారు. గాంధీ విగ్రహానికి, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


ఏఎంఏఎల్ కళాశాలలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ జయబాబు

- స్థానిక జీవీఎంసీ కార్యాలయంలో జెడ్సీ వెంకటరమణ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- ఆర్డీవో కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఆర్డీవో చిన్నికృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.
- తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి తహసీల్దార్ గంగాధరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.
- దిశ, పట్టణ పోలీస్ స్టేషన్లలో గాంధీ చిత్రపటానికి సీఐలు మహేష్, దాడి మోహనరావులు, గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు గాంధీ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.
- మండలంలో పంచాయతీ, సచివాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.
- డైట్ కళాశాలలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ గాంధీ చిత్రపటానికి, ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీనగరంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను సందర్శించిన ఆయన అక్కడ గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొని, సొంత నిధులతో వసతి గృహ శిథిల భవనాలకు మరమ్మతులు చేపడతానని భరోసానిచ్చారు.
- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో గాంధీ విగ్రహానికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయిన భానుమూర్తి యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- స్థానిక సబ్ జైల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి జైల్ సూపరింటెండెంట్ వై.ఎస్.గణేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖైదీలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పీజే నాయుడు, బల్లా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.
- గాంధీబొమ్మ జంక్షన్‌లో మాజీ కౌన్సిలర్ కరణం శ్రీనివాసరావు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనకాపల్లి రూరల్: అంతర్జాతీయ దార్శనికుడు గాంధీజీ, దేశ సంస్కరణలకు ఆద్యుడు లాల్ బహదూర్ శాస్త్రి అని ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు అన్నారు. కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాలలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావుతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ మహాత్ముడి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగస్వాములవుతామని కార్యక్రమానికి హాజరైన వారు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేశ్వరరావు, సూపరింటెండెంట్ అనూరాధ, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

మండల పరిషత్ కార్యాలయంలో..

జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో సాధ్యమయిందని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ జయంతి వేడుకల్లో భాగంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేటి యువత బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆర్ రమేష్, మండల కోఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు, కరణం సత్తిబాబు పాల్గొన్నారు.

కశింకోట: కశింకోటలో పలుచోట్ల జాతి పిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి ఎంపీపీ కలగా లక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి స్వాతంత్ర్య సముపార్జనలో గాంధీజీ త్యాగాలను ప్రస్తుతించారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

- స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉన్న గాంధీ విగ్రహానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సర్పంచ్ మంత్రి జయరజని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజిమెన్, పంచాయతీ కార్యదర్శి రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


నూకాంబిక ఆలయంలో గాంధీ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈవో బండారు ప్రసాద్

- డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్లో గాంధీజీ విగ్రహానికి హెచ్ఎం ఎంఆర్‌పీ అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఆచంట రవి, భీశెట్టి ఆనంద్, పీవీ ప్రభాకరరావు, బొడ్డేడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.
- బయ్యవరంలోని సన్నీ యూత్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా పేదలు, వృద్ధులకు రొట్టెలు పంపిణీ చేశారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత కొరుప్రోలు వెంకటేశ్వరరావును దుశ్శాలువా కప్పి, జ్ఞాపికతో సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు జి.ఆదిరాజు, గవర్నింగ్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మాధవరావు, మాజీ అధ్యక్షులు నూకరాజు, ఈశ్వరరావు, గోవింద, మురళి, శ్రీనివాసరావు, చెవ్వేటి అప్పారావు, సత్యనారాయణ, ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు అగ్గాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు కామాకుల సూర్యనారాయణ పాల్గొన్నారు.
- చింతలపాలెం గ్రామంలో గాంధీ విగ్రహానికి సోమవరం గ్రామ మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు.


సబ్ జైల్లో ఖైదీలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న జైల్ సూపరింటెండెంట్ గణేష్


మహాత్మా సేవా సంఘంలో నిరుపేదలకు దుప్పట్లు అందిస్తున్న జానకీరామరాజు


గాంధీచౌక్ వద్ద బాపూజీ సంఘ సభ్యులు


ఎంహెచ్ స్కూల్లో గాంధీ విగ్రహం వద్ద..


ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భానుమూర్తియాదవ్


డైట్ కళాశాలలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దాడి రత్నాకర్


కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కలగా లక్ష్మి


కశింకోట పంచాయతీ కార్యాలయంలో


కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో గాంధీ విగ్రహం వద్ద ఉపాధ్యాయుల నివాళి


బయ్యవరంలో గాంధీ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న సన్నీ యూత్ క్లబ్ నివాళులు


బయ్యవరంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావుకు సత్కారం

చవితి ఉత్సవాల్లో అన్న సమారాధన

అనకాపల్లిటౌన్: అన్నదానాల్లో అన్నదానం గొప్పదని వైఎస్సార్‌సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి అన్నారు. పట్టణంలో నర్సింగరావుపేట, పూడిమడక రోడ్‌లో వినాయక నవరాత్రులను పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత దైవభక్తి కలిగి ఉన్నట్లయితే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, మాజీ కౌన్సిలర్ దాడి భోగలింగేశ్వరరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.


పూడిమడక రహదారిలో అన్న సమారాధన ప్రారంభిస్తున్న జానకీరామరాజు, విష్ణుమూర్తి

మెగా నేత్ర వైద్య శిబిరానికి స్పందన


కశింకోటలోని కస్పావీధిలో మెగా కంటి వైద్య శిబిరం


మోదీ జీవిత విశేషాలపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకిస్తున్న బీజేపీ నేతలు, స్థానికులు

కశింకోట: కశింకోటలోని కస్పావీధిలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో బీజేపీ నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 160 మందికి వైద్య సేవలందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆప్తాలమిక్‌లు వచ్చి రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ శిబిరాన్ని ముందుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ఆదర్శ జీవితాన్ని గడుపుతూ ప్రజా రంజకమైన పాలన సాగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ జీవిత విశేషాలపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. కోశాధికారి ఎం.ఎం. నాయుడు, పార్టీ నాయకులు శిష్టి అప్పారావు, నడిపల్లి సన్యాసిరావు, ఎంపీటీసీ సభ్యురాలు నడిపల్లి గంగాభవాని, స్థానిక ప్రతినిధులు గొంతిన రమణాజీ, జనపరెడ్డి అప్పారావు, గొంతిన నాగేశ్వరరావు, ప్రగడ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

అనకాపల్లిటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మండలంలోని మారేడుపూడి సచివాలయం వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ఎస్. సమీమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మారేడుపూడి సచివాలయం పరిధిలో ఇప్పటికే ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టామన్నారు. శిబిరంలో రోగులకు స్పెషలిస్ట్ వైద్యులచే ఉచితంగా వైద్యం అందించి, మందులు పంపిణీ చేస్తామన్నారు. మెడికల్ క్యాంపు సాయంత్రం 5 గంటల వరకూ ఉంటుందన్నారు.

కశింకోట: స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్లో సచివాలయం-1 పరిధికి సంబంధించి మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు సోమవారం తెలిపారు. ఇప్పటికే ఇంటింటి సర్వేలో గుర్తించి, టోకెన్లు అందుకున్న రోగులతోపాటు తాజాగా వచ్చే రోగులకు కూడా అవసరమైన రక్త, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించనున్నట్లు పేర్కొన్నారు. వైద్య నిపుణులు హాజరై రోగుల్ని పరీక్షించి అవసరమైన వారిని ఉన్నత చికిత్స కోసం రిఫరల్ ఆస్పత్రులకు పంపనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని 1వ సచివాలయ పరిధి ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

శభాష్ వలంటీర్స్

అనకాపల్లి రూరల్: ఆ వలంటీర్ల నిబద్ధత, లబ్ధిదారులకు సమయానికి పింఛన్ నగదు అందించాలన్న తపన స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారుల చెంతకు చేర్చే సేవావారధులుగా గుర్తింపు పొందిన వలంటీర్లు ప్రభుత్వం నిర్దేశించిన పరిధికే పరిమితం కాకుండా మానవతా దృక్పథంతో వ్యవహరిస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే అవ్వాతాతలు, దివ్యాంగులు, వికలాంగుల తలుపుతట్టి పింఛను సొమ్ము అందిస్తున్నారు. నిస్సహాయ స్థితిలో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల వద్దకే వెళ్లి పింఛను సొమ్ము అందించి శభాష్ అనిపించుకుంటున్నారు.

మండలంలోని సత్యనారాయణపురం-1 సచివాలయం పరిధిలో వలంటీర్లు వీపీఎస్ చంద్రిక, పి.శిరీషలు తమ జాబితాలో పింఛన్లు ఇవ్వాల్సిన వారిలో మిగిలిపోయిన వారిని గుర్తించి వారి వద్దకే వెళ్లి పింఛను సొమ్మును అందించారు. అనారోగ్యంతో షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్న జె.నరేష్, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్‌గా చికిత్స తీసుకుంటున్న ఎం.ఎరుకునాయుడు ఇద్దరూ కదల్లేని స్థితిలో ఆస్పత్రికే పరిమితమయ్యారు. దీంతో వారి వద్దకే వెళ్లి వలంటీర్లు పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందించారు. వీరి నిబద్ధతను సత్యనారాయణపురం గ్రామ సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ జోగా నాగమణి, గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పలకా సత్తిబాబు, జోగా నాగేశ్వరరావు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, సహవలంటీర్లు ప్రశంసించారు.


షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న నరేష్ పింఛను సొమ్మును అతని భార్యకు అందిస్తున్న వలంటీర్ శిరీష


ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఎరుకునాయుడికి పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్ చంద్రిక

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

మునగపాక: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవాటు చేసుకోవడంతో, మానసిక ప్రశాంతత ఉంటుందని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మునగపాకలోని స్నేహసాయి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని సోమవారం దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్, సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్, పీఏంసీ చైర్మన్ ఆడారి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

చిన్నారులకు వక్తృత్వ పోటీలు

అనకాపల్లిటౌన్: స్థానిక వివేకానంద ఫంక్షన్ హాలులో సోమవారం రాత్రి గాంధీ జయంతిని పురస్కరించుకుని చిన్నారులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఎంపీ బీవీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా యువజన విభాగం కార్యదర్శి జాజుల రమేష్, జిల్లా వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ బొడ్డేడ లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపీ సత్యవతి దంపతులు

సొంత ఖర్చుతో బోరు ఏర్పాటు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని సోమవారం తన సొంత ఖర్చుతో తాగునీటి బోరు ఏర్పాటు చేసి సేవా భావాన్ని చాటారు. తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో గతంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో తుపాను బాధితులకు అపార్ట్‌మెంట్లు నిర్మించారు. ఇక్కడ నివసిస్తున్న ప్రజలు కొన్నాళ్లుగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో అదనపు బోరు ఏర్పాటు చేయాలని స్థానికులు అభ్యర్థించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశాల మేరకు సొంతంగా రూ.లక్షతో ఎంపీటీసీ సభ్యురాలు భవాని బోరు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ భవానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ పాల్గొన్నారు.


తాగునీటి బోరు పనులు